ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

రూ.200 కోట్లు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి



మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి సుమారుగా రూ.200 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో ఆయన కలసి విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ పెరుగుతున్న కొద్ది రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఇందుకు అనుగుణంగా మరో రెండు ఫ్లై ఓవర్ బ్రిడ్జీలను నిర్మించాలని కోరారు.ఎస్ఎన్‌డీపీ పనులకు రూ.100 కోట్లు, శివారు కాలనీలో నూతనంగా నిర్మించే డ్రైనేజీ పనుల కోసం మరో రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి సహకరిస్తామని తనకు హామీ ఇచ్చినట్లు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు చేయగానే వెంటనే పనులు ప్రారంభిస్తామని దీంతో శివారు ప్రాంతాలకు మురుగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

జీవుల మనుగడకు చెట్లే జీవనాధారం



వనమహోత్సవం కార్యక్రమంలో వనస్థలిపురం నారాయణ పాఠశాల విద్యార్థులు

వనస్థలిపురం: జీవుల మనుగడకు చెట్లే ఆధారమని, అందువల్ల సమాజంలో ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని నారాయణ పాఠశాల డీఎస్ జోన్ ఏజీఎం హేమంబర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం వనస్థలిపురంలోని నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం హేమంబర్ మాట్లాడుతూ భావితరాలకు మంచి వాతావరణం అందించాలంటే మొక్కలు నాటడంతోనే సాధ్యమని లేకపోతే కాలుష్యం కారణంగా భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. అందుకే విద్యార్థులకు చిన్ననాటి నుంచే చెట్ల ప్రాధాన్యత గురించి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవానీ, డీన్స్ రామలింగం, చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ సుమారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సుధీర్‌రెడ్డి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న జక్కిడి మల్లారెడ్డి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, కొత్తపేట, నాగోల్ తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని, నేటి రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తి ప్రదాత అన్నారు. తొలి కార్మిక శాఖ మంత్రిగా పనిచేసి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక్క మచ్చ లేని మహా నేత అని, నేటితరం యువత జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. - ఎల్‌బీనగర్/దిల్‌సుఖ్‌నగర్



చంపాపేట చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఉద్యమకారుడు బైగళ్ల రాము



మూసారంబాగ్‌లో..



కొత్తపేట్‌లో...



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న బేర బాలకిషన్

ఎల్‌బీనగర్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

మధుయాష్కీ గౌడ్



తీగల కృష్ణారెడ్డితో కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ సమీపంలోని టీకేఆర్ విద్యాసంస్థలలో మాజీ ఎమ్మెల్యే ఈగల కృష్ణారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితారెడ్డి , హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలసి మధుయాష్కీ గౌడ్ హస్తినాపురం డివిజన్‌లో నెలకొన్న ససమ్యలపై శనివారం చర్చించారు. ప్రధానంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసేందుకు త్వరలో రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి శ్రీధర్‌బాబును కలసి సమస్యల గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజక వర్గం సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బుర్ర జగన్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తాలో జంక్షన్ ఏర్పాటులో భాగంగా శనివారం హయత్‌నగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి పావని ఆధ్వర్యంలో ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి రాఘవేంద్ర హోటల్ వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న దుకాణాల ముందు రోడ్డును ఆక్రమించి వేసుకున్న రేకుల షెడ్లను, సిమెంటు ర్యాంపులను జేసీబీ ద్వారా తొలగించారు. ఇటీవల జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ డివిజన్ పర్యటనలో భాగంగా ఆనంద నగర్ చౌరస్తాను సందర్శించగా చౌరస్తాలో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలను తీర్చాలని ఆయనను కోరారు. దీనిలో భాగంగానే శనివారం ఆనంద్ నగర్ చౌరస్తా నుంచి రాఘవేంద్ర హోటల్ వరకు వ్యాపార సంస్థల ముందు ఆక్రమించుకున్న అక్రమ నిర్మాణాలను తొలగించారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

నాగోలు: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీస్‌లు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. యాదాద్రి, భట్టుగూడెంకు చెందిన రమావత్ శ్రీను, అదే ప్రాంతానికి చెందిన సూర్య ఇద్దరు కలసి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. శనివారం మన్సూరాబాద్ నుంచి శ్రీను 12 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు శ్రీను అరెస్టు అతని వద్ద నుంచి 5 క్వింటాళ్ల బియ్యం, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఈ సంఘటనలో సూర్య పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేం

మన్సూరాబాద్: మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన చేశారని, వారి సేవలు ఎన్నటికీ మరువలేమని బీఆర్ఎస్ మన్సూరాబాద్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీశ్ యాదవ్ అన్నారు. 12 సంవత్సరాలుగా పాఠశాలలో బోధన చేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుండటతో శనివారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజితలను జగదీశ్ యాదవ్ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకట్, సుధాకర్, నరేష్, చిన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జగదీశ్ యాదవ్ తదితరులు

సమస్యలపై జేఏసీ సమావేశం నేడు



వనస్థలిపురం రాజప్పనగర్‌లో సమావేశమైన తూర్పు కాలనీల జేఏసీ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం తూర్పు కాలనీల జేఏసీ ఆధ్వర్యంలో ట్రాఫిక్, శానిటేషన్ తదితర సమస్యలపై ఆదివారం ఉదయం 8.30 గంటలకు కమలానగర్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు దీపావళి శ్రవణ్‌కుమార్, గుత్తా లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాజప్పనగర్ కాలనీలో సమావేశమైన జేఏసీ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆదివారం జరిగే సమావేశంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మున్సిపల్ అధికారులు పాల్గొంటున్నారని, కాలనీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరై సమస్యలను నేరుగా వారి దృష్టికి తీసుకరావచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, ఎన్.సుధీర్‌రెడ్డి, బి.జలంధర్‌రెడ్డి, టీ.వీ.రావు, సుబ్బారావు, సి.దివాకర్ లింగం పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



చైతన్యపురి: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను శనివారం కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో డివిజన్‌లో పర్యటించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సైదాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినయ్‌నగర్ కాలనీలో నివసించే బత్తుల విష్ణువర్ధన్‌రెడ్డి (40) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి అతను తన ద్విచక్ర వాహనం (ఏపీ 22పీ2394)పై కర్మన్ ఘాట్ నుంచి సంతోష్‌నగర్ వైపు వెళుతుండగా రహదారిపై అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోతూ మరో ఆరుగురికి ప్రాణదానం

బ్రెయిన్‌డెడ్ అయిన సెక్యూరిటీగార్డు అవయవాలు దానం



నర్సింగ్‌రావు (ఫైల్)

మన్సూరాబాద్: కొందరు మరణిస్తూ కూడా మరొకరి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ కోవలోనే సెక్యూరిటీ గార్డుగా పనిచేసే వ్యక్తి చనిపోతూ మరో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళితే... సికింద్రాబాద్ మారేడుపల్లికి చెందిన టికుమట్ల నర్సింగ్‌రావు (39) భార్య జ్యోతి, ముగ్గురు పిల్లలతో కలసి నివాసముంటున్నాడు. గత నెల 28న తన వాహనంపై వెళ్తూ అకస్మాత్తుగా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సింగ్‌రావును ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. కామినేని వైద్యులు ఆరు రోజులుగా అత్యవసర చికిత్స అందించారు. ఆయన చికిత్సకు స్పందించకపోవడంతో శుక్రవారం ఉదయం 11గంటల ప్రాంతంలో బ్రెయిన్ డెడ్ అయినట్లు కామినేని వైద్యులు ప్రకటించారు. ఈ విషయం జీవన్‌ధాన్ ప్రతినిధులు తెలుసుకుని నర్సింగ్‌రావు భార్య జ్యోతి, కుటుంబ సభ్యులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో నర్సింగ్‌రావు గుండెను శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. లివర్, రెండు కిడ్నీలు జీవన్‌ధాన్‌కు, కార్నియాలను సరోజని కంటి ఆసుపత్రికి అందజేశారు. గ్రీన్ చానల్ ఉపయోగించకుండా గుండె తరలించడం విశేషం.

సమాచార చేరవేతలో పోస్టల్ సేవలు కీలకం



హస్తినాపురం: గతంలో సమాచారాన్ని ఇతరులకు చేరవేయడంలో పోస్టల్ సేవలు ఎంతో కీలకంగా ఉండేవని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్‌కుమా ర్ అన్నారు. స్థానిక ఉత్పత్తుల కేంద్రం ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తుల గురించి ఎల్‌పిడీవో ద్వారా ఇంటింటికీ పోస్టు బాక్సు ద్వారా ప్ర చా రం చేయడం అభినందనీయమని ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఉత్పత్తుల కేంద్రం అధ్యక్షులు భరత్ సంఘం ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ ఫర్ బెటర్ నేషన్ అనే శీర్షికపై పోస్టు బాక్స్ లెటర్స్ ద్వారా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఎల్‌బీనగర్ డీసీపి కార్యాలయంలో డీసీపి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం వరకు ప్రతి ఒక్కరూ పోస్టల్ లెటర్ ద్వారా సమాచారం ఇచ్చే వారన్నారు. అలాంటి రోజులు తిరిగి రావాలనే ఉద్దేశంతో ఎల్‌పీడీవో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు ఎల్‌వీ చెన్నారావు, శ్రీనివాస్‌చారీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

వనస్థలిపురం: భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై మ క్కువ పెంచుకున్న చిన్నారి క్రితిక అమెరికాలో భరతనాట్యం నేర్చుకున్నప్పటికి దేశం మీద మమకారంతో హైదరాబాద్‌లో తన అరంగేట్రం చేసి అందరినీ ఆకట్టుకుంది. శని వారం భారతీయ విద్యా భవనం అందుకు వేదికైంది. హైదరాబాద్‌లోనే తన మొదటి ప్రదర్శన ఉండాలనే సంకల్పంతో శనివారం సాయంత్రం నగరంలోని భారతీయ విద్యా భవనంలో భరతనాట్యం ప్రదర్శన ఇచ్చింది. ఈ ప్రదర్శన అందరిని విశేషంగా ఆకట్టుకుంది. దేశం మీద మమకారంతో చిన్నారి ఇక్కడ ప్రదర్శన చేయడంపై అందరు హర్షం వ్యక్తం చేసి ఆమెకు అభినందనలు తెలిపారు.

37.5 క్వింటాళ్ల రేషన్ సరుకులు స్వాధీనం

చంచల్‌గూడ: మలక్‌పేట సివిల్ సప్లై పరిధిలో ఆ శాఖ ముమ్మరంగా దాడులు కొనసాగిస్తోంది. దీనిలో భాగంగానే బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యం, గోధుమలు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం చావణీ డివిజన్‌లో పీడీఎస్ బియ్యం, గోధుమలు అక్రమ నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న మలక్‌పేట సివిల్ సప్లై శాఖ ఏఎస్‌ఓసీ రాజశేఖర్ మాదన్నపేట పోలీసులతో కలసి దాడులు నిర్వహించగా 25.5 క్వింటాళ్ల బి య్యం, 12 క్వింటాళ్ల గోధుములు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహ్మద్ సాజిద్‌ను అదుపులోకి తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేశారు.

జయశంకర్ సార్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

నాగోలు: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జయశంకర్ సార్‌కు సరైన గౌరవం ఇవ్వలేదని, తెలంగాణ జాతిపితగా ప్రకటించడంపై తీవ్ర నిర్లక్ష్యం చేశారని రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని వర్కర్స్ పార్టీ ఇండియా ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో వర్కర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండు రంగాచారి ఆధ్వర్యంలో శనివారం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ తాను విద్యార్థిగా ఉన్నప్పుడే తెలంగాణ సంపదని ఆంధ్ర సంపన్న వర్గాల ఎట్లా దోపిడీ చేస్తున్నాయో వివరించారన్నారు. అంతేకాకుండా ఆంధ్రా వలస పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రజల్ని భాగస్వామ్యం చేయడంలో కీలకంగా మారారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చామకూర రాజు, ఇన్‌చార్జి కెవి గౌడ్, డివిజన్ మనమయ్య సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెలకుర్తి చంద్రశేఖర్ తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చైతన్యపురి: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాలు... చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడు సుమారు 60 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, ఎవరనేది ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే వివరాలు స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా



వనస్థలిపురంలో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్) స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నోచికాన్, బనారస్ చీరలతోపాటు లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు, గాజులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



నూతన విద్యార్థి కౌన్సిల్ సభ్యులతో పాఠశాల యజమాన్యం

లింగోజిగూడ: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అందుకు ఉపాధ్యాయులు కూడా నాయకత్వ లక్షణాలు, సమాజ బాధ్యతలపై బోధించాలని నేవీ కమాండో సునీల్ కుమార్, పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ మల్కా యశస్వీ అన్నారు. ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థి కౌన్సిల్ కార్యవర్గం ఏర్పాటు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 2024–25 విద్యార్థి కౌన్సిల్ కార్యవర్గ సభ్యులకు బ్యాడ్జీలను అందజేశారు. ప్రిన్సిపాల్ చారుజైన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు నోటీసులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లకు 15 మంది నోటీసులు ఇచ్చి వారిని విధుల నుంచి తొలగించామని మలక్‌పేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి జ్యోత్స్నారెడ్డి తెలిపారు. శనివారం మలక్‌పేటలో ఆమె మాట్లాడుతూ సైదాబాద్, చార్మినార్, అంబర్‌పేట మండలాలో 238 మంది అంగన్‌వాడీ టీచర్లు పని చేస్తున్నారని తెలిపారు. అందులో 15 మంది రిటైర్‌మెంట్ అవుతున్నట్లు తెలిపారు. వారి స్థానంలో దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లను ఇన్‌చార్జులుగా నియమించడం జరుగుతుందని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని ప్లకార్డుతో ప్రదర్శన



కౌన్సిల్ సమావేశంలో ప్లా కార్డులతో ఆందోళన చేస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం నిర్వహించిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్ల కార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయించకపోవడంతో డివిజన్‌లో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. వర్షాకాలం సమీపించినా ముంపు ప్రాంతాలలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై మాట్లాడే అవకాశం లేకుండా ఘర్షణ వాతావరణాన్ని సృష్టించడంపై ఎంఐఎం, కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డాడు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరారు.